సూర్య

17వ

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,23 జనవరి 2024

1

# జగనన్నకు చెబుదాం - స్పందనకు 245 అర్జీలు



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారాలు ఇవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్ ఇలక్కియ..ఇన్చార్జి డీఆర్‌వో, డీఆర్డీఏ పీడీ కె శ్రీరమణిబీ బీసీ కార్పొరేషన్ ఈడీ అద్దంకి శ్రీనివాసరావు, సీపీవో పీ.త్రీనాథ్‌బీ పౌరసరఫరాల సంస్థ డీఎం డీ.పుష్పమణి, లతో కలిసి హాజరై జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కారించ వలసిందిగా ఆయా శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం-245 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఒకే అంశంపై మళ్ళీ మళ్ళీ అర్జీలు నమోదు కాకుండా అర్జీలపై అధికారులు దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల జీవన ప్రమాణాలు పెంచే కేంద్ర పథకాలు







- అన్నివర్గాల భాగస్వామ్యంతో అభివృద్ధికి కృషి
- వికసిత్‌భారత్ కో-ఆర్డినేటర్ పియూష్‌కుమార్
- కాకినాడలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర
- పాల్గొన్న జేసీ ఇలాక్కియా, కమిషనర్ నాగనరసింహారావు, అధికారులు

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కేంద్ర ప్రభుత్వ కామర్స్ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి పియూష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన వికసిత్‌భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ఆయనజ్యోతిప్రజ్వలనచేసి ప్రారంభించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్‌నాగనరసింహారావు,జడ్పీ సీఈవో రమణారెడ్డి,వివిధప్రభుత్వశాఖలఅధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు.కాకినాడనగరపాలకసంస్థ పర్యవేక్షణలో ఈకార్యక్రమం ఏర్పాటైంది. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తోన్న ఆయుష్మాన్‌భారత్, ఉజ్వల్ యోజన, పీఎం స్వనిధి, ఆధార్, వంటి దాదాపు 15 పథకాలపై అవగాహన కోసంఏర్పాటుచేసినస్టాల్స్‌ను పీయూష్ కుమార్ సందర్శించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులను సత్కరించారు. వివిధపథకాలలబ్ధిదారులమనో భావాలను వెల్లడించారు. అక్కడ ఉన్న అధికారులు, లబ్ధిదారులతో మాట్లాడారు. ఈసందర్భంగావివిధపాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి.ప్రధాని నరేంద్రమోదీ హయాంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పథకాలకు సంబంధించిన డాక్యుమెంటరీని అక్కడ ప్రదర్శించారు. అభివృద్ధికి పునరంకితమవుతామని సభకు విచ్చేసిన వివిధ పథకాల లబ్ధిదారులతో ప్రతిజ్ఞ చేయించారు. వికసిత్ భారత్ కేలండర్‌ను ఆవిష్కరించి లబ్ధిదారుల మనోగతాన్ని వివరించారు.కేంద్రపథకాలకుసంబంధించిన ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు ప్రశ్నలు వేయించి సమాధానాలు రాబట్టారు. అనంతరం పియూష్‌కుమార్ మాట్లాడుతూ పౌష్టికాహారం నుంచి విద్య, ఉపాధి, వైద్యం, గృహనిర్మాణం సహా అన్ని రంగాల్లో ప్రజలకు ప్రయోజనం కలిగేలా ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.అయితే వీటిపై సరైన అవగాహన కొరవడిందని, అందువల్లే ప్రభుత్వం వికసిత్‌భారత్ సంకల్పయాత్ర పేరుతో ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తోందన్నారు.ఇప్పటికే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఈతరహాసదస్సులు నిర్వహించామని, ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లో నిర్వహించామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా మాట్లాడుతూ అర్హత ఉన్న లబ్ధిదారులకు అవగాహన కల్పించి కేంద్ర పథకాల లబ్ధిని ప్రతీ ఒక్కరికి అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అర్హులైన లబ్ధిదారులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని పథకాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ ప్రియంవద,లీడ్‌డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రసాదరావు, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి, నగరపాలక సంస్థ ఎస్‌ఈ పి.సత్యకుమారి, స్మార్ట్‌సిటీ ఎస్‌ఈ వెంకట్రావు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, డిఎల్‌డీవో పి.నారాయణమూర్తి, బీజేపీ మేథావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ముత్తా నవీన్, బీజేపీ ప్రముఖులు వై.మాలకొండయ్య,రంబాలవెంకటేశ్వరరావు, రామ్ కుమార్, గట్టి సత్యనారాయణ, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లాలో 15,99,065 మంది ఓటర్లు

- జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా వెల్లడి

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో 15,99,065 మంది ఓటర్లుగా నమోదు అయినట్టు జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా తెలిపారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 తుది జాబితాను సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా.. అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ కాకినాడ జిల్లా ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితా ప్రకారం జిల్లాలోని 1,637 పోలింగ్ కేంద్రాల్లో 15,99,065 మంది ఓటర్లుగా నమోదు అయ్యాయన్నారు. ఇందులో 7,88,105 మంది పురుష ఓటర్లు, 8,10,781 మంది స్త్రీ ఓటర్లు, 179 మంది ఇతరులుగా ఉన్నారని ఆమె వివరించారు.

జిల్లాలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఓటర్లు నమోదును పరిశీలిస్తే...తుని నియోజకవర్గంలోని 223 పోలింగ్ కేంద్రాలలో 1,09,052 పురుషులు, 1,11,800 స్త్రీలు, 25 మంది ఇతరులు, మొత్తం 2,20,877 మంది ఉన్నారన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 227 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,05,412 మంది పురుషులు 1,082,027 మంది స్త్రీలు, 20 మంది ఇతరులు మొత్తం- 2,13,639 ఓటర్లుగా నమోదు అయ్యారని, పిఠాపురం నియోజకవర్గ పరిధిలో 242 పోలింగ్ కేంద్రాలులో 1,15,223 మంది పురుషులు,1,14,819 మంది స్త్రీలు, 4 మంది ఇతరులు, మొత్తం- 23,0046 మంది ఓటర్లుగా ఉన్నారని, కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని 264 పోలింగ్ కేంద్రాలలో 1,29,584 మంది పురుషులు, 1,31,591 మంది స్త్రీలు, 11 మంది ఇతరులు, మొత్తం 2,61,186 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలోని 200 పోలింగ్ కేంద్రాలలో 1,04,446 మంది పురుషులు,1,07,478 మంది స్త్రీలు, 13 మంది ఇతరులు మొత్తం 2,11,937 మంది, కాకినాడ సిటీ నియోజకవర్గంలోని 233 పోలింగ్ కేంద్రాలలో 1,13,177 మంది పురుషులు, 1,23,166 మంది స్త్రీలు, 94 మంది ఇతరులు మొత్తం 2,36,437 మంది ఓటర్లుగా నమోదు అయ్యారన్నారు.

జగ్గంపేట నియోజకవర్గంలోని 248 పోలింగ్ కేంద్రాలలో 1,11,211 మంది పురుషులు, 1,13,720 మంది స్త్రీలు ,12 మందిఇతరులు మొత్తం 2,24,943 మంది ఓటర్లుగా నమోదయ్యారని కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు.జిల్లాలు అక్టోబర్ 27న ప్రచురించిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికి మొత్తం కాకినాడ జిల్లాలో 15,89,755 మంది ఓటర్లుగా నమోదు కాగా అందులో 704 78 మందిని అదనంగా వాటర్లుగా నమోదు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇందులో 11510 మంది చనిపోయారని, 41958 మంది వేరే ప్రాంతాలకు తరలి వెళ్లారన్నారు. 7,700 మంది డబుల్ ఓటర్లుగా గుర్తించగా 61,168 మంది ఓటర్లను తొలగించడం జరిగిందన్నారు. ఎస్-ఎస్‌ఆర్-2024 రూపకల్పనలో 28471యొక్క సవరణలు చేయగా మొత్తం జిల్లాలో 15 లక్షల 99వేల 065 మంది ఓటర్లుగా నమోదయ్యారని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గత సంవత్సరం అక్టోబర్ 27 నుంచి నేటి వరకు సమావేశాలు నిర్వహించడం జరిగిందని జిల్లాలో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఒక్కొక్క పోలింగ్ కేంద్రం చొప్పున మొత్తం మూడు పోలింగ్ కేంద్రాలను నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని 1,637 పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులకు సంబంధించి విద్యుత్, ఫర్నిచర్, టాయిలెట్లు, తాగునీరు, ర్యాంప్ లను సమకూర్చడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా తెలిపారు.

## వాగ్గేయకార వైభవంపై సామవేదం ప్రవచనం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సర్పవరంలో వేంచేసియున్న భవానీ సమేత శ్రీనీలకంఠేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఈనెల 28 నుండి సాయంత్రం 6:30 గంటలకు రెండు రోజులపాటు వాగ్గేయకార వైభవంపై ప్రవచన విరంచి సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలు ఉంటాయని సద్గురు సంగీత విద్యాలయ వ్యవస్థాపకురాలు పెద్దాడ సూర్య కుమారి తెలిపారు. భక్తులు, ఆధ్యాత్మిక చింతనపరులు అందరూ పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

**30న త్యాగరాజ ఉత్సవం** ..సద్గురు సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన సర్పవరం నారదకుండ సమీపాన ఉన్న భవాని సమేత శ్రీనీలకంఠేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీవాగ్గేయకార మండపము నందు త్యాగరాజ ఆరాధన ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యాలయ వ్యవస్థాపకురాలు, అంతర్జాతీయ గాయని పెద్దాడ సూర్యకుమారి తెలిపారు. 30వ తేది ఉదయం 9 గంటలకు పల్లకి సేవ, అష్టోత్తర పూజ, అనంతరం 10 గంటలకు ఆకొండి శ్రీనివాస రాజారావు త్యాగరాజస్వామి కీర్తనలపై ప్రసంగిస్తారని తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక కళాకారులు మరియు సంగీత విద్యార్థిని విద్యార్థులు పంచరత్న కీర్తనలను గానం చేస్తారని, సంగీత ప్రియులందరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## లయిన్ జి.వి.రావు ఆధ్వర్యంలో వైభవంగా శ్రీరామ సంకీర్తన ర్యాలీ



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** అయోధ్యపురిలో బాలరాముని ప్రాణప్రతిష్ట మహోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటిన నేపథ్యంలో సోమవారం మోడరన్ విద్యాసంస్థల అధినేత లయిన్ జి.వి.రావు నేతృత్వంలో మోడరన్ జి.ఆర్.సి. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సి.హెచ్.రాజేష్ పర్యవేక్షణలో మోడరన్ జూనియర్ కాలేజి స్టాఫ్, విద్యార్థులు ఆధ్యాత్మిక వాతావరణంలో జై శ్రీరామ్ అని ముక్తకంఠంతో నినాదిస్తూ, శ్రీరాముని దివ్య మంగళ రూపాన్ని పల్లకిలో ఊరేగిస్తూ రామచంద్రపురం ప్రధాన రహదారులలో "శ్రీరామ సంకీర్తన ర్యాలీ" నిర్వహించారు.ఈ సందర్భంగా మోడరన్ అధినేత లయిన్ జి.వి.రావు మాట్లాడుతూ శ్రీరాముడు మానవ రూపంలో జన్మించిన దేవుడని ప్రణమిల్లుతూ, మన భారతదేశం సనాతనమైనది, సదా నూతనమైనదని, దేశమంతా రామమయంగా మారి పండుగ వాతావరణం నెలకొన్న ఈ శుభ సందర్భంలో భారతీయ చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు విద్యార్థులు తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. అనంతరం ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సి.హెచ్.రాజేష్ మాట్లాడుతూ హక్కుల కంటే భాధ్యత గొప్పదని చాటి చెప్పేది రామతత్త్వం అని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.ఎస్.ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సి.హెచ్.శ్రీనివాస్, మోడరన్ జూనియర్ కాలేజీ స్టాఫ్, విద్యార్థులతోపాటు స్థానికులు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వాడవాడలా రామాలయాల్లో పూజలు







- రామనామంతో మార్మోగిన దేవాలయాలు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** నగరంలో వాడవాడలా ఉన్న రామాలయాల్లో శ్రీరామ సీతా సమేత లక్ష్మణులవారికి ఘనంగా పూజలు నిర్వహించడం జరిగింది. ఏటిమొగ, పరలోపేట, సంజయ్ నగర్, కొండాయపాలెం, పైడా వారి వీధి,డాల్ఫిన్స్‌కాలనీ, గాంధీనగర్‌లలో ఉన్న రామాలయాల్లో రామనామ భజనలతోటి దేవాలయాలు మార్మోగిపోయాయి. భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఈ ప్రాంతాల్లో 12 గంటల 30 నిమిషాల ముహూర్త కాలానికి కాలానికి పూజాది కార్యక్రమాల్లో పాల్గొని భక్తుల చేత భజనలు చేయించటం జరిగింది.భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్,మాజీఅధ్యక్షుడు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ, బిజెపి సీనియర్ నేత, మీడియా ప్యానలిస్ట్ దువ్వూరి సుబ్రహ్మణ్యం ఉదయం 10 గంటల నుండి అనేక ప్రాంతాలలో దేవాలయాల్లోపాల్గొని పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఏటిమొగలో భారతీయ జనతా పార్టీ నాయకులు చిలుకూరు రామకుమార్, ఎనిమిరెడ్డి మాలకొండయ్య,గట్టి సత్యనారాయణ, దువ్వూరి సుబ్రహ్మణ్యం శ్రీరామ సీతా సమేత లక్ష్మణ ఆంజనేయుల విగ్రహాల పల్లకిని మోస్తూ వీధి వీధినా జైశ్రీరామ్ నినాదాలతో భక్తులను ఉత్సాహపరిచారు. స్థానిక పైడా వారి వీధిలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పైడా కృష్ణమోహన్, పైడా భావన ప్రసాద్, పైడా శంకర్రావు తదితరులు పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేయడం జరిగింది.అయోధ్యలో రాముడు జన్మించాడని కోట్లాదిమంది హిందువుల విశ్వసిస్తున్న ప్రదేశంలో రామాలయ పునర్నిర్మాణంతో భారత దేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కీర్తి ప్రపంచంలో నలుమూలల వ్యాపించనున్నదని, దేశ భవిష్యత్తు నరేంద్ర మోడీ నేతృత్వంలో ఉజ్వలంగా వెలగనున్నదని ఈ సందర్భంగా నాయకులు భక్తులను ఉద్దేశిస్తూ ప్రసంగించడం జరిగింది.

# చిత్తడి నేలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- డి.ఎఫ్.వో ఎస్.భరణి
- ఘనంగా చిత్తడి నేలల సంరక్షణపై జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలు
- 23 పాఠశాలల నుంచి 114 మంది విద్యార్థులు హాజరు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** చిత్తడి నేల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత యని జిల్లా అటవీ సంరక్షణ అధికారిణి ఎస్.భరణి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్, పాఠశాల విద్యాశాఖ, మరియు అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి చిత్తడి నేలల సంరక్షణ అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం గాంధీనగర్ శాఖా గ్రంధాలయం (వివేకానంద పార్క్) నందు చిత్తడి నేల సంరక్షణపై జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 23 పాఠశాల నుంచి 114 మంది విద్యార్థులు హాజరయ్యారు. చిత్తడి నేలలుల మరియు వాటి యొక్క సంరక్షణపై చక్కటి చిత్రాలను విద్యార్థులు చిత్రించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి జిల్లా అటవీ సంరక్షణ అధికారిణి ఎస్.భరణి మాట్లాడుతూ చిత్తడి నేలలు, మడ అడవులను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. ప్లాస్టిక్ క్యారీబ్యాగ్స్‌లనుప్రతిఒక్కరూ స్వయంగా నిషేధించుకోవాలన్నారు. మొక్కలు పెంచడం జీవితంలో ఒక భాగంగా కావాలని తెలియజేశారు. మడ అడవులు కాకినాడ పరిసర ప్రాంతాలను తుఫానుల బారి నుంచి కాపాడుతున్నాయని, అటువంటి మడ అడవులనురక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని డీ.ఎఫ్.ఓ. తెలిపారు. జీవ వైవిధ్యం పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ చిత్తడి నేలల సంరక్షణ అవగాహనపరిరక్షణఅవగాహనకార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ ఎమ్. శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ-పరిరక్షణపై ప్రతిఒక్కరూ దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అటవి క్షేత్రధికారి (ఫారెస్ట్ రెంజర్) ఎస్.ఎస్.ఆర్ వరప్రసాద్, నేషనల్ గ్రీన్‌కోర్‌జిల్లాసమన్వయకర్త కె.వి.కె.మహేశ్వర రావు, చిన్నబాబు, రమణమూర్తి,ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హిందువుల చిరకాల స్వప్నం అయోధ్య రామ మందిరం

- వాడవాడలా రామమయం



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** ప్రపంచవ్యాప్తంగా ఎదురు చూస్తున్న అయోధ్య రామమందిర నిర్మాణం పూర్తి చేసి రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా వాడవాడలా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామాల్లో శ్రీరామ శోభాయాత్ర నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, యువత శ్రీరామనామ నినాదాలతో కాషాయ జెండాలు చేతబూని శోభాయాత్ర నిర్వహించారు. వాడవాడలా శోభాయాత్ర నిర్వహకులకు, ప్రయాణికులకు ప్రసాద వితరణ, బెల్లం పానకాలు అందజేశారు. స్థానిక పెద్ద వీధిలో వేంచేసి యున్న శ్రీరామాలయం నందు శ్రీ సీతారామస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సుందరకాండ పారాయణ కావించారు. సాయంత్రం ఆలయం ప్రాంగణంలో బ్రహ్మశ్రీ దెందులూరి సర్వేశ్వర సీతారామశర్మచే రామాయణ ప్రవచనం కావించారు. ది కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ శోభాయాత్ర నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ, బెల్లం పానకాలు అందజేశారు.

## అక్రమంగా నిర్మించిన పెట్రోల్ బంకు నిర్మాణం కూల్చివేత హర్షణీయం

- గొంది వెంకటేశ్వర్లు



**ఎటపాక, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి వ్యతిరేకంగా అల్లూరి సీతారా మరాజు జిల్లా ఎటపాక మండలం లక్ష్మీదేవిపేట (మేడువాయి) గ్రామంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఒక గిరిజనేతరుడు అక్రమంగా, ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన పెట్రోల్ బంకును శనివారం రాత్రి తహసీల్దార్ ఆధ్వర్యంలో కూల్చి వేయడం జరిగింది. ఆ పెట్రోల్ బంకు కూల్చివేయడం హర్షణీయం అని జాతీయ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు గొంది వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకు కూల్చివేయడంతోపాటు ఆ చుట్టూ వున్న 15 ఎకరాల భూమిని కూడా స్వాధీనం చేసుకోవలని, పెట్రోల్ బంకు చుట్టూ వున్న ప్రహరీగోడను, ఇతర కట్టడాలని తక్షణమే కూల్చివేయాలని ఆయన రెవిన్యూ శాఖ అధికారులను కోరారు. లక్ష్మీదేవిపేట (మేడు వాయి) గ్రామంలో వున్న ప్రభుత్వ భూములను అధికారం, డబ్బు అండతో 1/70చట్టం అమలులో వున్నా గిరిజనేతరులు అక్రమంగా కబ్జాలు చేస్తూ, కట్టడాలను నిర్మిస్తు న్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన రెవిన్యూ శాఖ అధికారులను కోరారు.

## వాడవాడలా శ్రీరామ నామ నగర సంకీర్తనలు



**అనపర్తి, మేజర్ న్యూస్ :** అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి సంఘీభావంగా మండలంలోని వాడవాడలా భక్తులు, రామదండులా శ్రీరామ సంకీర్తనలు, శ్రీరాముల వారికి ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు, దీపోత్సవాలు, కోలాటం ముత్యాలతో గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

అనపర్తి గ్రామంలోని మహాలక్ష్మి పేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో పురోహితులు నాగదేవర బాలాజీ శర్మ ఆధ్వర్యంలో పొతంశెట్టి శ్రీనివాసరెడ్డి, శ్రీ జ్యోతి, తేతలి వెంకటరెడ్డి, కాంచన తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరామ నామ సంకీర్తనలతో పురవీధుల్లో కాషాయ జెండాలతో కండువాలతో చిన్నారులు రామ పరివార్ ఆంజనేయ వేషాలు ధరించి మహిళలు పళ్ళల్లో దీపాలు వెలిగించుకుని జై శ్రీరామ్ జై శ్రీరామ్ శరణు ఘోష ఉచ్చరిస్తూ గ్రామంలో ఉన్న ఆలయాల సందర్శిస్తూ రామ స్థూపాల వద్ద ప్రదక్షణ చేశారు.

పొలమూరు గ్రామంలో గ్రంథాలయం వద్ద వేంచేసి ఉన్న రామాలయంలో ఆలయ చైర్మన్ గొలుగూరి మూలారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సంకీర్తనలు, దీపోత్సవం నిర్వహించారు. అట్లే మండలంలోని అన్ని రామాలయాలు శ్రీరామనమ స్మరణతో మారు మోగాయి. యావన్మంది భక్తులు రామాలయాల్లోనే కాకుండా తమ తమ ఇళ్ల వద్ద కూడా దీపోత్సవం నిర్వహించి రాముడుపై తమకున్న భక్తిని చాటుకున్నారు.

## 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మెర్లపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్యాబ్ లు పంపిణీ కార్యక్రమం జరిగింది. పాఠశాల పేరెంట్స్ కమిటి చైర్మన్ పువ్వల లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మెర్ల రాము పాల్గొని మాట్లాడుతూ 8వ తరగతి విద్యార్థులకు 2023-24 సంవత్సరంకు గాను ప్రభుత్వం సమకూర్చిన టాబ్స్ ద్వారా పాఠ్యాంశంలో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ట్యాబులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. శ్రీహరి, ఉపాధ్యాయులు ఆర్.వి.వి. సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అదుపులోకి తీసుకున్నవారిని విడుదల చేయాలి



**- అంగన్‌వాడీలు నిరసనలు**

**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** మండలంలో టీచర్లు, ఆయాలు 150 మంది అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేస్తున్నామని, అల్లవరం, పి.గన్నవరం, అంబాజీపేట మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నవారిని వెంటనే విడుదల చేయాలని నిరసన వ్యక్తం చేసారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలను వెంటనే విడుల చేయాలని, అంగన్‌వాడీల ఐక్యత వర్ధిల్లాలి, జీతాలు పెంచమంటే ఎస్మా ఉపయోగిస్తారా, ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రభుత్వాన్ని మా న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతున్నామని అన్నారు. రాత్రి, తెల్లవారుఝామున అన్యాయంగా అదుపులోకి తీసుకున్నవారిని వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేసారు.

# కండువాలు కప్పే సంస్కృతి టీడీపీది కాదు

**- గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం**

**- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :**కండువాలుకప్పేసంస్కృతి తెలుగు దేశం పార్టీకి ఏనాడులేదనిఆపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ రాజమహేంద్రవరం సిటీ కార్యాలయంలో కలిసి తమ సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని గ్రామీణ వైద్యులు (బిఎంపీ, పీఎంపీలు) కోరారు.వారి సమస్యలపై స్పందించిన ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణవైద్యులనుగుర్తించిందితెలుగుదేశం ప్రభుత్వమేన న్నారు. గ్రామీణ వైద్యులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. అనేక మార్లు రెండు బస్సుల్లో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు గ్రామీణ వైద్యులను తీసుకువెళ్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ల దృష్టికి వారి సమస్యలను వివరించి



వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయం నుంచి గ్రామీణ వైద్యులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. అయితే వారికి శిక్షణ ఇచ్చి పరీక్ష నిర్వహించి పారామెడిక్స్ కింద వారిని గుర్తించాలని నాడు అనుకున్న అంశమన్నారు.అటుతరువాత అధికారం లోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ హయాంలోచంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా వారికి నష్టంకలుగుకుండా చూడాలన్న ప్రయత్నాలయితే జరిగాయని గుర్తుచేశారు. ఆ ప్రయత్నాలు అమలు దశకు చేరే సమయంలో ప్రభుత్వం మారడం, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం జరిగిందన్నారు. జగన్ గ్రామీణ వైద్యులకు అనేక హామీలు ఇచ్చి నమ్మించి మోసం చేశాడరని ధ్వజమెత్తారు. గ్రామీణ వైద్యులను క్వాక్స్ (తప్పులు చేసే మనుషులు) అని ప్రభుత్వం సంభోదించినప్పుడు ఆ సమయంలో నోరు మెదపని అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు ఇప్పుడు వారి అవసరం కనిపిస్తోందా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామీణ వైద్యులను మళ్లీ నమ్మించి మోసం చేసేందుకు జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కారం కేవలం ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. ఆ దిశగా ఆలోచనలు చేయాలని గ్రామీణ వైద్యులను ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాజమండ్రి పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు యాళ్ల ప్రదీప్, మాజీ కార్పొరేటర్ కొమ్మ శ్రీనివాస్, మండల రవి, గ్రామీణ వైద్యులు తదితరులు ఆయన్ను కలిసిన వారిలో ఉన్నారు.

## జై శ్రీరామ్ నినాదాలు అన్నప్రసాద వితరణలతో హోరెత్తిన పెరవలి మండలం



**పెరవలి, మేజర్ న్యూస్ :** అయోధ్యలో బాలరాముని బాల రాముని ప్రాణ ప్రతిష్ట పురస్కరించుకుని పెరవలి మండలం లోని అన్ని గ్రామాలలో రామాలయాలు వద్ద భజనలు కోలాటాలు అన్నప్రసాద వితరణలతో పాటు జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు . వేకువజాము నుండి యువకులు జైశ్రీరామ్ నినాదాలతో బైక్ ర్యాలీలు నిర్వహించగా మహిళలు పెద్దలు రామనామ సంకీర్తనలతో తెల్లవారుజామునుండే గ్రామంలో ప్రతి వీధి వీధి శ్రీరామ జపం చేస్తూ గ్రామ సంకీర్తనలు నిర్వహించారు. జిల్లాలోనే అత్యధిక రామాలయాలు కలిగిన ఖండవల్లి గ్రామంలో గల 19 రామాలయాల వద్ద పూలతో డెకరేషన్ చేసి భజనలు రామనామ సంకీర్తనలు చేసి పానకాలు పంచిపెట్టారు. అన్నవరప్పాడు సెంటర్ వద్ద 16వ నెంబరు జాతీయ రహదారి ప్రక్కన రాజధాని ధర్మకాట ఆవరణలో జనవరి 22వ సోమవారం మెగా అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అన్నవరప్పాడు గ్రామస్తులు పొప్పోప్పు వెంకట నాగేశ్వరరావు (అబ్బులు) సూర్య నాగేశ్వరరావు (పిఎస్) ల నేతృత్వంలో మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నవరపాడుతో పాటు పరిసర గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చి అయోధ్య బాల రాముని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముందు అయోధ్యలో ప్రాణప్రతిష్ట జరిగిన బాల రాముని చిత్రపటాన్ని ఉంచి పూజలు నిర్వహించారు.

## 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల బ్యానర్ ఆవిష్కరణ

**- ఆవిష్కరించిన ఐటిడిఏ పిఓ**




**చింతూరు, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండల కేంద్రంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 తారీకు నుండి ఫిబ్రవరి 19 తారీకు వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా రవాణాశాఖ వారి బ్యానర్ మరియు పోస్టర్స్‌ను చింతూరు ఐటిడీఏ పీవో కావూరి చైతన్య సోమవారం పిఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పి.ఆనంద్‌రావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ యస్.శ్వేత సాయి పాల్గొన్నారు. ఈ సంధ్బంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వారు చింతూరు మండలం పరిధిలో గల వాహనదారులకు రహదారి భద్రతపై పూర్తి అవగాహన కల్పించే విధంగా పలు రకాల అవగాహన సదస్సులను ఎర్పాటు చేసి 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను రవాణాశాఖ అధికారులు, పోలీసు అధికారులు మరియు ఐటిడిఏ పిఓ సహకారంతో పూర్తి చేస్తామని తెలియజేశారు. అదే విధంగా చింతూరు మండల పరిధిలో గల లారీ యూనియన్ అసోసియేషన్ వారిని, ఇతర వాహన యూనియన్ అసోసియేషన్ వారిని మరియు మీడియా మిత్రులను ఈ సదస్సులలో పాల్గొని విజయవంతం చేయవలసింది గా కోరారు.

## బీసీలకు సముచిత స్థానం కల్పించింది మేమే



**- నిడదవోలు తెదేపా ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు**

**పెరవలి, మేజర్ న్యూస్ :** బీసీలకు సముచిత స్థానం కల్పించింది టిడిపి పార్టీ అని భవిష్యత్తులో బీసీలకు సముచిత స్థానం కల్పించేది కూడా తెదేపానని నిడదవోలు తెదేపా ఇంచార్జ్ నిడదవోలు మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు అన్నారు. జనవరి 22వ తేదీ సోమవారం పెరవలి దీపికా కళ్యాణ మండపంలో తెలుగుదేశం జనసేన పార్టీల నాయకులు బూరుగుపల్లి శేషారావు బి వి ఎస్ ఎన్ ప్రసాద్ ల ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిడదవోలు తెదేపా ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ నిర్వహించిన జయహో బిసి సభలు నిడదవోలు నియోజకవర్గం లో విజయవంతంగా జరిగాయని బీసీ సోదరుల నుండి చక్కటి స్పందన వచ్చిందని ఈ ముగింపు సభా కార్యక్రమం అదే ఉత్సాహంతో జరిగింది అన్నారు. మహా నాయకులు డాక్టర్ అంబేద్కర్ జ్యోతిరావు పూలేల ఆశయాలతో తెలుగుదేశం పార్టీని మనందరి అన్న నందమూరి తారకరామారావు స్థాపించారని వారి ఆశయాల సాధన కోసం మనమంతా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు డాక్టర్ అంబేద్కర్ జ్యోతిరావు పూలేల సరసన నిలవదగ్గ నాయకుడు మన అన్న ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. నిడదవోలు నియోజకవర్గానికి సంబంధించి సీటు తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా ఎవరికిచ్చిన మనమంతా కలిసి పనిచేసే ఆ అభ్యర్థిని గెలిపించుకోవాలని ఆయన ఇరు పార్టీల కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుండి బీసీ యువకులు పెద్ద ఎత్తున తెలుగు దేశం పార్టీలో చేరడానికి ముందుకు రాగా వారిని ఆహ్వానించి పార్టీలో జాయిన్ చేసుకుని పార్టీ కండువాలు కప్పారు ఈ కార్యక్రమంలోనిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం మరియు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు బిసి వర్గానికి చెందిన అన్ని కులాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు తెలుగు దేశం మరియు జన సేన నియోజకవర్గ స్థాయి నాయకులు తో పాటు పెరవలి మండల తెదేపా అధ్యక్షులు అతికాల కృష్ణమ్మ జనసేన మండల పార్టీ అధ్యక్షులు పిప్పర రవి డిసిఎంఎస్ మాజీ అధ్యక్షులు భూపతి రాజు రవివర్మ తెదేపా నాయకులు సలాది కృష్ణమూర్తి సలాది శ్రీహరి వాకలపూడి వీర్రాజు కంటిపూడి సూర్యనారాయణ మల్లపూడి రాజేంద్రప్రసాద్ వేంద్ర వెంకట రామమూర్తి రెడ్డి సత్యనారాయణ మంగం రామారావు రాపాక ప్రమీల నల్లాకుల వెంకటేశ్వరరావు నల్ల సురేంద్ర జనసేన నాయకులు పాల సత్యవీరాస్వామి నందిప శ్రీనివాస చక్రవర్తి ఇరు పార్టీలకు చెందిన నాయకులు పెరవలి మండలానికి చెందిన తెదేపా జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గోరింటలో అయోధ్య శోభయాత్ర

**- పాల్గొన్న భక్తులు**




**పెద్దాపురంరూరల్,మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, గోరింట గ్రామంలో దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అయోధ్యలో నిర్వహిస్తున్న బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న నేపధ్యంలో భాగంగా దానిని పురస్కరించుకుని గోరింట గ్రామంలో గ్రామ పురోహితులు గోవిందవర్జుల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో శివరామ బాలభక్త భజన సమాజం, ఓంశక్తి మహిళా భజన సమాజం, సత్యసాయి మహిళా భజన సమాజం, ఆలయ కమిటి, గ్రామ భక్తులు పర్యవేక్షణలో గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెదరామాలయం నుండి ప్రారంభమై చినరామాలయం, గణపతి ఆలయం, దుర్గమ్మ గుడి, గ్రామంలోని వివిధ రామాలయాలు, గ్రామ దేవత తాళలమ్మ తల్లి, సత్తెమ్మ తల్లి ఆలయాల మీదుగా ఈ శోభయాత్ర కొనసాగింది. భక్తులు జైశ్రీరామ్ అని నినాదాలు చేసుకుంటూ గోరింట గ్రామం మారుమ్రోగింది.

## ప్రజలకు అవసరమైన కధనాలు రాయాలి

**- జర్నలిజంలో నిజాయితీ ఉండాలి**

**- ఐ.టి.డి.ఏ పి.ఓ కావూరి చైతన్య**



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** ప్రజలకు అవసరమైన కధనాలు రాసి, మంచి పేరుతో పాటు అందరికీ ఆదర్శంగా నిలవాలని ఐ.టి.డి.ఏ. పి.ఓ.చేవూరి చైతన్య స్పష్టంచేశారు. సోమవారం ఐ.టి.డి.ఏ. ప్రాంగణంలో మనం క్యాలండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంర్నలిజంలో నిజాయితీతో పాటు నిబద్ధతకు కట్టుబడి వుండాలని సూచించారు. జీతభత్యాలు లేకుండా! ప్రజలకు, ప్రభుత్వానికి, అధికారులకు, వారధులుగా నిలవడం ఒక్క జర్నలిస్టుకే సాధ్యమని ఆయన తెలిపారు. ఈ క్యాలండర్ ఆవిష్కరణలో కూనవరం,చింతూరు, వరరామ చంద్రాపురం, జంర్నలిస్టులు హాజరయ్యారు.

## రామ నామంతో మారుమ్రోగిన గ్రామాలు



యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ : అయోధ్య రామ మందిరం నిర్మాణం శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా యు.కొత్తపల్లి మండలంలో ఉప్పాడ, వాకతిప్ప, కుతుకుడిమిల్లి, కొత్తపల్లి, కొండేవరం తదితర గ్రామాలలో శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లి ఊర చెరువు సమీపం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి గుడి వద్ద బత్తుల సతీష్, శారద దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలు అన్న ప్రసాదం కోసం బారులు తీరారు. ఈ కార్యక్రమం గ్రామ పెద్దలు సహాయ సహకారాలతో దున్న చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిపారు. కొత్తపల్లి పాత తాసిల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న రామాలయంలో తోట శాంతి కుమార్, గంధం గంగ బాబు, సాన లోవరాజు లు ప్రత్యేక పూజలు నిర్వహించి, కొత్తపల్లి గ్రామమంతా శ్రీరాముడు ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని జైశ్రీరామ్ నామస్మరణతో మారుమోగించారు. ఈ సందర్భంగా తోట శాంతి కుమార్, దున్న చిట్టిబాబు మాట్లాడుతూ హిందువుల ఆరాధ్య దైవం అయిన శ్రీరాముని దేవాలయం నిర్మాణం చారిత్రక ఘట్టం అయితే, ఈరోజు శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం కోసం దేశవ్యాప్తంగా ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఇంతటి మహోత్తర కార్యక్రమం దేశ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరగటం ప్రతి హిందువు గర్వించదగిన విషయమ న్నారు. ఎన్ని అవాంతరాలు, ఎన్ని అవరోధాలు ఎదురైనా, అయోధ్యలో రామాలయం నిర్మించడంతో దేశ ఖ్యాతి ప్రపంచ నలుదిశలా వ్యాపించిందన్నారు. ఈకార్యక్రమంలో పెద్దఎత్తున గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలు ఆహార పదార్థాలు ఎంతో మేలు చేస్తాయి

**- వ్యవసాయశాఖ డైరీ ఆవిష్కరణ చేసిన కలెక్టర్ మాధవీలత**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** చిరు ధాన్యాలు ద్వారా ఎంతో పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత పేర్కొన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ లో వ్యవసాయ శాఖ అసోసియేషన్ డైరీ ని, చిరు ధాన్యాలతో 100 పిండి వంటలు పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా కె. మాధవీలత మాట్లాడుతూ, 2023 వ సంవత్సరాన్ని ఐక్య రాజ్య సమితి చిరు ధాన్యాలు ఏడాదిగా ప్రకటించి, ఆమేరకు మిల్లెట్స్ సాగు విస్తీర్ణం పెంచడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, డి ఆర్వో జి.నరసింహులు,స్పెషల్ డి సి/ పర్యాటక శాఖ ఆర్ డి వి. స్వామి నాయుడు,డీఏవో డాక్టర్ ఎస్.మాధవరావు, వ్యవసాయ జిల్లా అధ్యక్షులు - డాక్టర్ డి.వి.కృష్ణ ఉపాధ్యక్షుడు - డాక్టర్ డి.కె. మల్లికార్జున్ కార్యదర్శిడాక్టర్ కమల్ రాజ్. కె సంయుక్త కార్యదర్శి - డాక్టర్ రాజారావు. బికోశాధికారి-డాక్టర్ రామ తులసి. డి మరియు వ్యవసాయ అధికారులందరూ హాజరయ్యారు.

## మండలంలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు -గ్రామంలో సంకీర్తన ర్యాలీ



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని రామాలయ, ఆంజనేయ స్వామి, వెంకటేశ్వర స్వామి, శివాలయాలు తదితర దేవాలయాల్లోసోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు, భక్తులు పూజా మందిరంలో జైశ్రీరామ్ అంటూ రామ నామం స్మరిస్తూ పూజలు నిర్వహించి రామ భక్తిని చాటుకున్నారు. భక్తులు పైడా లక్ష్మి, దంట్ల కుమారి,సూరపురెడ్డి రాంబాబు ఆధ్వర్యంలో మహిళా భక్తులు, చిన్నారులు తెల్లవారుజామున గ్రామంలో జైశ్రీరామ్ అంటూ సంకీర్తనలర్యాలీ నిర్వహించారు..బీసీ కాలనీలో ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయాన్ని శుభ్రపరిచి అలంకరించి రాత్రి దీపాలు వెలిగించారు.అలానే మండలం లోని రామాలయా లలోభక్తులు పూజలు నిర్వహించారు. ప్రతీ ఆలయాలు,ఇళ్ల వద్ద సోమవారం రాత్రి భక్తులు దీపాలు వెలిగించి రామనామం జపించారు. అయోధ్యలో 500 ఏళ్లనాటి రామ మందిర నిర్మాణ కళ సాకారమైనందుకు ఏజెన్సీలో అయోధ్య శోభ సంతరించుకుంది.

## క్రీడల అభివృద్ధికి వైకాపా ప్రభుత్వం కృషి

**- రామేశ్వరం సర్పంచ్ కొటికలపూడి చినబాబు**



**పెదపూడి, మేజర్ న్యూస్ :** క్రీడలను ప్రోత్సహిస్తూ, క్రీడాకారుల ఉన్నత భవిష్యత్తుకు జగన్ ప్రభుత్వం అధిక అనపర్తి నియోజకవర్గం సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు, రామేశ్వరం సర్పంచ్ కొటికలపూడి చినబాబు పేర్కొన్నారు. పెదపూడి మండలం జి.మామిడాడలోని డిఆర్కె రెడ్డి కాలేజీ ఆవరణంలో సోమవారం ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు ముగిసాయి. ఈ సందర్భంగా క్రికెట్ విభాగంలో సంపర ,రామేశ్వరం జట్లు మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో రామేశ్వరం విన్నర్‌గా, సంపర్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎంపీడీవో సాయిబాబు, కోటికలపూడి చినబాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడీఓ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలన్నారు. ఇలాంటి గ్రామీణ క్రీడల ద్వారా క్రీడాకారులు మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఈపిఓపిఆర్డి ఎం. సత్యనారాయణ రెడ్డి, సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాస చౌదరి, అచ్చిరాజు, త్రినాద్, చిన్ని, బి.ప్రసన్న, కృష్ణారెడ్డి, పిజికల్ డైరెక్టర్స్ గిరి, ,గౌరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## చవిటిదిబ్బలు రహదారి నిర్మాణం పూర్తి చేయాలి


**- ఐటీడీఏ గ్రీవెన్స్‌లో గిరిజనులు వినతి**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం మండలం పందిరిమామిడి నుండి కోట మీదుగా చవిటిదిబ్బలు వరకు చేపట్టిన రహదారి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని గిరిజనులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఈవారం వివిధ సమస్యలపై 13 వినతులు రావడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా పందిరిమామిడి గ్రామం నుండి వై.రామవరం మండలం కోట మీదుగా చవిటిదిబ్బలు వరకు చేపట్టిన రహదారి నిర్మాణం పూర్తి కాకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ రహదారి మార్గం మధ్యలో భీమవరం-నరసాపురం గ్రామాల మధ్యలో సుమారు పది కిలోమీటర్ల రోడ్డు పనులు ఆగిపోయాయని, వెంటనే రోడ్డు పూర్తి చేయాలని వాడపల్లి పంచాయతీ సర్పంచ్ అన్నిక పండమ్మ, కత్తుల లచ్చిరెడ్డి, వి౦డెల సూర్య కుమార్, కింటుకూరి సూరిబాబు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కోట గ్రామంలో త్రాగునీటికి సంబంధించిన వాటర్ ట్యాంకు శిధిలావస్థలో ఉందని, వెంటనే కొత్త వాటర్ ట్యాంక్ నిర్మించాలని కింటుకూరి సూరిబాబు వినతిపత్రాన్ని సమర్పించారు. దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామంలో సర్వే నెంబర్ 364/2 లో భూమి సమస్య పరిష్కరించాలని కొల్లాబత్తుల కృష్ణ దరఖాస్తు సమర్పించారు.

గంగవరం మండలం పంద్రప్రోలు గ్రామ గిరిజన రైతులు 40 మందికి సుమారు 100 ఎకరాలకు సోలార్ పెన్సింగ్ మంజూరు చేయాలని సుంకారపు బాబురావు దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామంలో నేషనల్ హైవే 516ఇ రోడ్డు వెడల్పులో తమ కుటుంబానికి సంబంధించిన భూమి నష్టపరిహారం ఒక ఎకౌంట్లో వేయడం వలన తమ కుటుంబ సభ్యులకు డబ్బులు ఇవ్వలేదని, ఈ సమస్య పరిష్కరించాలని కుంజం గోపాలకృష్ణ, కుంజం సాయికృష్ణ దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలనా అధికారి డి.యన్.వి. రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.శాస్త్రి, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ అబూ సలాం, ఏ.డి.యం.హెచ్.ఓ. జి. ప్రకాశం, డి.ఎల్.పి.ఓ. రాఘవన్, పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎం.డి.యూసఫ్, సుబ్బయ్య, ఏడిఏ సావిత్రి, పి.హెచ్.ఓ. చిట్టిబాబు, పి.ఏ.ఓ. రాంబాబు, డాక్టర్ ఇందిర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సాయి సతీష్, చైతన్య, మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, రామచంద్రమూర్తి, లీగల్ సెల్ డిప్యూటీ తాహసిల్దార్లు స్వామి, వి.రవీంద్రబాబు, న్యాయవాది యన్.వి.వి. సత్యనారాయణ, వెలుగు డిపిఎం అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఓ స్పందనకు 4 అర్జీలు



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 4 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ జె. సీతారామారావు తెలిపారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివైఇఓ దాట్ల సుభద్ర, ఎ.ఎస్.డబ్ల్యూ.ఓ వాణి, మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, హౌసింగ్ ఏఇ రవిశంకర్, హెచ్‌డబ్ల్యూఓ శ్రీవల్లి, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, ఆర్డీఓ కార్యాలయ ఏఓ వెంకటలక్ష్మి, డిటి భానుకుమార్, దయానందరాజు, నారాయణ, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం




**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** మండలంలోని కింద్ర గ్రామంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం అన్నసమారాధనకార్యక్రమం జరిగింది. అయోధ్య లో నూతనం గా నిర్మించిన రామమందిరంలో బాల రాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా దేశవ్యాప్తంగా రామాలయాలలో పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా రాజవొమ్మంగి మండలం శరభవరం, కింద్ర,లాగరాయి,దుసరిపాము పంచాయితీ లలో సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రజాప్రతినిధులు పాల్గొని పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేశారు. కింద్రలో ఎంపీపీ వెంకటలక్ష్మి, లాగరయిలో సర్పంచ్ మిరియాల గణి లక్ష్మి అధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## చింతూరు రామాలయంలో ఘనంగా శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం



**చింతూరు, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని అయోధ్యలో బాల రాముని శిలా విగ్రహ యంత్ర ప్రాణప్రతిష్ట సందర్భంగా చింతూరులోని శ్రీ కోదండరామచంద్రస్వామి దేవాలయంలో సోమవారం శ్రీరామ హెూమ కార్యక్రమం వేద పండితులు రాకేశ్ శర్మ, మహేష్ శర్మ, నరేష్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా రామభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సేవకులు దాసరి రవిశంకర్, భాస్కర్ స్వామి, వలబొజుల జోగేశ్వరరావు, శ్యామల సుబ్బయ్య, నరసింహారావు, మాని సత్యనారాయణ, పయ్యాల నాగేశ్వరరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు. భక్తులకు పులిహెూర ప్రసాదాలు పంచారు. అనంతరం గ్రామంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రాత్రి ఆలయంలో మహిళలు దిపోత్సవం నిర్వహించారు.

## స్పందనలో వచ్చిన అర్జీలు 131



**- స్పందనలో వచ్చిన ప్రజా సమస్యలు నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలి**

**- ఏఒక్క అర్జీ రీఓపెన్ కాకుండా అధికారులు పరిష్కరించాలి**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** స్పందనలో వచ్చిన అర్జీలను అధికారులు విచారించి నిర్ణీత కాలవ్యవధిలోనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత అధికారులకుసూచించారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచిజాయింట్ కలెక్టర్ ఎన్‌తేజ్‌భరత్,డిఆర్ఓ నరసింహులుతో కలిసి కలెక్టర్ మాధవీలత వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భం గా కలెక్టర్ డా.మాధవీ లత మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం స్పందనలో వినతులుఅందించిన ప్రజలసమస్యలనునిర్ణిత కాలవ్యవధి లోనే పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. శాఖపరమైన అధికారులు వారి పరిధిలో ఉన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించి, వారి పరిధిలో లేని వాటిని సంబంధిత శాఖ అధికారులు పంపించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈరోజు స్పందనలో 131 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించామన్నారు.

ఇందులో ఆన్లైన్లో 116,ఆఫ్ లైన్‌లో 15 అర్జీలు ఉన్నాయని తెలిపారు.సమస్యలు పరిష్కారంకొరకు ఏఒక్క అర్జీ దారుడిని కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. కలెక్టర్ అన్నారు. స్పందనలో నమోదైన ప్రతి అర్జీని పరిష్కరించాలని ఆయన సూచించారు. జగనన్నకు చెబుదాం పోర్టల్ లో వచ్చిన అర్జీలను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పునరావృతమయ్యే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**-స్పందనలో వచ్చిన కొన్ని అర్జీలు:** నల్లజర్ల మండలం చీపురు గూడెం గ్రామానికి చెందిన జాలపర్తి అప్పారావు తమ అర్జీలో చీపురుగూడెంలో 5.17 ఎకరాల భూమి ఉందని,అయితే స్థానికులు కొందరు నా భూమికి తూర్పు వైపునున్న 40సెంట్లు మట్టి పోసి ఇబ్బంది పెడుతున్నారని తన న్యాయం చేయాలని వారు అర్జీలో పేర్కొన్నారు. తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామానికి చెందిన గన్నిన సత్యనారాయణ తమ అర్జీలో గజ్జరం గ్రామంలో 32/1 లో 1.60 ఎకరాలు 32/3 లో 53 సెంట్లు భూమి ఉందని నా భూమి హద్దులు నిర్ణయిస్తూ సర్వే చేయించాలని అందుకు అయ్యే తగు రుసుమునుచెల్లించగలవాడిననిఅర్జీలో పేర్కొన్నారు .జాయింట్ కలెక్టర్ ఎన్ ఏజ్ భరత్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 24 తేదీ నుంచి నియోజకవర్గాల స్థాయిలో క్రీడలు ప్రారంభించేందుకు సంబంధిత అధికారులను తగు చర్యలు ఆదేశించారు .

క్రీడలనియోజకవర్గస్థాయి ఇంచార్జి అధికారులు కార్యాచరణ ప్రణాళికతో పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్,డీఆర్వో జి.నరశింహులు, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామి నాయుడు,డియంహెచ్ఓ డా.కె.వేంకటేశ్వర రావు, డిసిహెచ్ఒ డా. ఎమ్.సనత్ కుమారి, సీపీఓ ఎల్. అప్పల కొండ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్. మాధవరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కె.విజయ కుమారి,డిఈఓ ఎస్.అబ్రహం, డిఎల్‌డిఓ పి. వీణాదేవి, సివిల్ సప్లై జిల్లామేనేజరు వి.నాగార్జున రెడ్డి, ఎస్ఈపిఆర్ ఎబివి ప్రసాద్, ఎస్ఈఆర్‌డబ్ల్యు ఎస్‌డి.బాల శంకరరావు, డిఎల్‌డివో వి.శాంతమణిపలువురు జిల్లాశాఖా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడవైపు చూస్తున్న నేతలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** పెద్దాపురం నియోజకవర్గ నేతల చూపు రాష్ట్ర కాపు నేత ముద్రగడ పద్మనాభం వైపు మళ్లుతోంది. రానున్న ఎన్నికల్లో పెద్దాపురం నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే టికెట్ ముద్రగడ పద్మనాభం కు కేటాయించనున్నట్టు వస్తున్న వార్తలపై తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల నాయకులు ఆయన వైపు మొగ్గు చూపుతున్నారు. ఒకపక్క పెద్దాపురం తెలుగుదేశం పార్టీ టికెట్ నిమ్మకాయల చినరాజప్పకు కేటాయింపు జరుగుతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. మరోవైపు కాపు నేత ముద్రగడ పేరు సోషల్ మీడియాలో హల్చల్ అవుతుండడంతో తెలుగుదేశం జనసేన పార్టీల పొత్తులో పెద్దాపురం టికెట్టు కేటాయింపు ఏ పార్టీకి జరుగుతుందని విషయంలో రెండు పార్టీల నాయకులు ఉత్కంఠ ఎదుర్కొంటున్నారు. దాన్లో భాగంగానే గత నాలుగు రోజుల క్రితం తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ గోరకపూడి చిన్నయ్య దొర ఆధ్వర్యంలో పట్టణ నాయకులు కాపునేత ముద్రగడ్డను మర్యాదపూర్వకంగా కలిసి వచ్చారు. ఇలా ఉండగా తాజాగా ఆదివారం రాత్రి జనసేన పార్టీ పెద్దాపురం నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మల రామస్వామి (బాబు), పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వచ్చారు. దీనితో ముద్రగడ తేదేలో చేరనున్నారా, లేదంటే జనసేన పార్టీకి మళ్లుతున్నారా అనే విషయంపై నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. అయితే తెలుగుదేశం పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే చినరాజప్పకు టికెట్ ఖరారు అయింది అనే విషయం ఎంతవరకు వాస్తవం అనేది నియోజకవర్గ ప్రజల్లో ప్రశ్నార్ధకంగానే మిగిలింది.

## పెండింగ్ బకాయిలు చెల్లించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ






**పిఠాపురం, మేజర్ న్యూస్ :** యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ... యూటీఎఫ్ అధ్వర్యంలో జిల్లా కార్యదర్శి సి. హెచ్ సూరి బాబు అధ్యక్షతన పిఠాపురం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ కాకినాడ జిల్లా ప్రధానకార్యదర్శి టి. రవి చక్రవర్తి మాట్లాడుతూ... ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించలేని పరిస్థితికి ఈ ప్రభుత్వం దిగజారిపోయిందని, 17 వ తేదీ కి కూడా జీతం వస్తుందో లేదో అనే పరిస్థితిలో ఉద్యోగ, ఉపాధ్యాయులు లోన్‌లు పెనాల్టీలు కడుతూ... బాధ పడుతున్నారని తెలిపారు. పిఆర్సి, డిఏ అరియర్లు రూ. 12000 కోట్లు, పిఎఫ్ , ఏపిజిఎల్ఐ బకాయిలు రూ. 1500 కోట్లు, సరెండర్ లీవ్ బకాయిలు రూ. 4500 కోట్లు మొత్తంగా రూ. 18000 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగి వచ్చి బకాయిలు చెల్లించాలని, లేకపోతే దశలవారీగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో జనవరి నెలలో ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ ధర్నా లో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీ హెచ్ సూరిబాబు, షేక్ రహిమాన్ బీ, టి సీతారామయ్య, కుటుంబ సంక్షేమ పథకం బాధ్యులు ఏ సీతారామరాజు, విపాములయ్య, పిఠాపురం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిశ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, ఎన్.శ్రీనివాసరావు, గొల్లప్రోలు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి ఈశ్వర రావు, ఎం.వి.సత్యనారాయణ, యు. కొత్తపల్లి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిరాజు, తేజ మరియు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హెూటళ్లలో డొమెస్టిక్ సిలిండర్‌ల స్వాధీనం..



**సామర్లకోట,మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలంలోని పలు హెూటల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లలో వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్ లు ఉపయోగిస్తూ ఉండటంతో వాటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండల సివిల్ సప్లై అధికారి కీర్తి ఆధ్వర్యంలో సోమవారం అధికారులు పలు హెూటళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు హెూటల్‌లో కమర్షియల్ సిలిండర్ లకు బదులుగా డోమెస్టిక్ సిలిండర్‌లు వాడుతున్నట్లు గుర్తించి వ్యాపారుల నుంచి 7డోమెస్టిక్ సిలిండర్‌లను సీజ్ చేసి హెూటల్ నిర్వాహకులపై 6(ఎ ) కేసులను నమోదు చేసారు.ఈ దాడుల్లో సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

## కోదండ రామాలయంలో భజనలు, శోభాయాత్ర

**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలోని కోదండరామాలయంలోఅయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ట సంధర్భంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో భజనలు, పూజలు శోభాయాత్ర (బైక్ ర్యాలీ), ధర్మ ప్రచారసేవా భక్తమండలి భక్తులు పాదయాత్ర చేసారు. గ్రామమంతా కాషాయ వస్త్రాలతో భక్తులు రామనామ కీర్తనలతో సందడి చేశారు. అరకు మాజీ పార్లమెంట్ సభ్యురాలు, బిజెపి నాయకురాలు కొత్తపల్లి గీత అయోధ్య రామలల్లా ప్రాణ ప్రతిష్ట లైవ్ కార్యక్రమాన్ని ఎల్ఇడి భారీ స్క్రీన్‌పై స్థానిక భక్తులు తిలకించే విధంగా ఏర్పాట్లు చేసారు. భక్తులు ఆర్థిక సహాయ సహకారంతో భారీ ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీకి ఎంతో సహకరించిన ఆర్.ఎస్.ఎస్., వి.హెచ్.పి., ఎస్.ఎస్.ఎఫ్., శ్రీవారి సేవకులు, ధర్మ ప్రచార సేవా భక్త మండలివారికి కోదండ రామాలయం ఆలయ కమిటీవారు కృతజ్ఞతలు తెలియచేసారని ధర్మ ప్రచార సేవా భక్తమండలి కో-ఆర్డినేటర్ తెలియచేసారు.

## రజక వృత్తిని పౌరసేవగా గుర్తించి సమస్యలు పరిష్కరించాలి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రజక వృత్తిదారులను పౌర సేవలుగా గుర్తించి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాకినాడ రూరల్లోని ఇంద్రపాలెం రజక కమ్యూనిటీ హాల్లో కొజ్జవరపు నాగేశ్వరరావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భాస్కరయ్య మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడిచిన నేటికీ రజకులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, చాలా వెనకబడి ఉన్నారని ఏ ప్రభుత్వాలు వచ్చినా రజకుల అభివృద్ధి అనేది లేదన్నారు. రజక వృత్తిదారులు సేవా వృత్తైన రజక వృత్తిని ఎంచుకొని ప్రజా శుభ్రత కోసం పనిచేస్తున్నారని కానీ రాష్ట్ర ప్రభుత్వం రజక వృత్తిని పౌరుసేవ వృత్తిగా గుర్తించకపోగా వృత్తి నిర్వహణలో యంత్రాలు ప్రవేశించినందువలన ఉపాధికి గండి పడే అవకాశం ఉందని భాస్కరయ్య వెల్లడించారు. రజక వృత్తిదారులకు స్టీమ్ ఐరన్ ఇస్త్రీ చేసేందుకు 250 యూనిట్లు, ఉచిత కరెంటు ఇవ్వాలని, అర్బన్ కేంద్రాల్లో మోడ్రన్ ధోబి గార్ట్స్ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ సంస్థలు, దేవస్థానాల్లో ఉన్న రజక వృత్తి ఉపాధిని రజక కుటుంబాల్లో ఉన్న యువతకు అవకాశం కల్పించి అభివృద్ధి పరిచే చర్యలు తీసుకోవాలని లేదంటే రానున్న ఎన్నికల్లో ఈ పాలకులకు తగిన గుణపాఠం చెప్తామని భాస్కరయ్య హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోనేటి రాజు మాట్లాడుతూ రజక వృత్తి చెరువులు కుంటల స్థలాలపై రజకులకే పూర్తి హక్కు కల్పించాలని, 50 ఏళ్లు పూర్తయిన రజకులకు వృద్ధాప్య ఫించన్ ఇవ్వాలని, ఫిబ్రవరి 9వ తేదీన కాకినాడలోని యుటిఎఫ్ భవన్‌లో 6వ జిల్లా మహాసభలు జరుగుతున్నవని సమస్యలు చర్చించేందుకు రజకులందరూ పాల్గొనాలని రాజు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో కొజ్జవరపు మాణిక్యం, పోలుపల్లి శ్రీనివాసులు, శీల అర్జున్‌రావు, కొమరపురి వీరబాబు, వాలపల్లి గంగాధరరావు, పెద్దపూడి చంటి, కొమరం సూరిబాబు, మహిళా నాయకులు మంగ, లక్ష్మి తదితరులు ప్రసంగించారు. అనంతరం 9వ తేదీన జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు.

## సీఎం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి - అంగన్వాడీ సంఘాలు



దేవరపల్లి, మేజర్ న్యూస్ : ఎన్ని అవాంతరాలు ఎదురైనా సమ్మె విరమించే ప్రసక్తే లేదని పాదయాత్రలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని మాట ఇస్తే మడమ తిప్పని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని వివిధ జిల్లాల అంగన్వాడీ కార్యకర్తలు అన్నారు. ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడికి ప్రయత్నించిన వివిధ జిల్లాలకు చెందిన సుమారు 250 మంది అంగన్వాడీ కార్యకర్తలను విజయవాడ నుంచి దేవరపల్లి కరుటూరి ఫంక్షన్ హాల్ వద్దకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తలు మాట్లాడుతూ మేము ఏ ప్రాంతంలో ఉన్నామో మాకే తెలియడం లేదని విజయవాడ, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, శ్రీకాకుళం, పలాస జిల్లాల కు చెందిన అంగన్వాడి వర్కర్స్ & హెల్పర్స్ లను విజయవాడలో దౌర్జన్యంగా బలవంతం చేసి బస్సులో ఎక్కించి అడావారని కుడా చూడకుండా మధ్యలో కనీస అవసరాలు కూడా తీర్చుకోడానికి కూడా తాగటానికి మంచినీరు ఇవ్వకుండా ఉగ్రవాదుల లాగా కనికరం కూడా లేకుండా మహిళా పోలీసులు ప్రవర్తించారని అంగన్వాడి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సులో అంగన్వాడీలకు బందోబస్తుగా వచ్చిన మహిళా పోలీసులను వివరణ కోరగా మాకేమీ తెలియదని వివరణ ఇచ్చారు. వివిధ జిల్లాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలను అక్రమంగా దేవరపల్లి కరుటూరి ఫంక్షన్ హాల్ వద్దకు తీసుకు వచ్చారని సమాచారం తెలుసుకున్న సిపిఎం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, సిఐటియు నాయకులు కె. రత్నాజీ టిడిపి గోపాలపురం ఇంచార్జ్ మద్దిపాటి వెంకట్రాజు టిడిపి నాయకులు ఆంద్రు అనిల్, గన్నమని హరికృష్ణ తదితరులు అంగన్వాడీ కార్యకర్తల దగ్గరకు వచ్చి తమ సంఘీభావం తెలియజేశారు.

## పెద్దాపురం నియోజకవర్గంలో 2,11,937 మంది ఓటర్లు




– ఆర్వో జె.సీతారామారావు

పురుషులు – 1,04,446, స్త్రీలు – 1,07,478,

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రకారం 2024 జనవరి 22న ప్రచురించిన తుది ఓటర్ల జాబితా నందు పెద్దాపురం నియోజకవర్గంలో 2,11,937మంది ఓటర్లు నమోదైయున్నారని, పెద్దాపురం నియోజకవర్గ ఈఆర్వో మరియు ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో స్థానిక విలేఖరుల సమావేశంలో తెలుపుతూ పెద్దాపురం రూరల్‌లో పురుషులు 29,885మంది, స్త్రీలు 29,508 మంది, పెద్దాపురం మున్సిపాల్టీలో పురుషులు 19,537మంది, స్త్రీలు 21,236 మంది, సామర్లకోట పురపాలక సంఘంలో పురుషులు 20,754మంది, స్త్రీలు 22,059 మంది, సామర్లకోట మండలంలో పురుషులు 34,270మంది, స్త్రీలు 34,675మంది ఓటర్లు కలరని, మొత్తం వీరితో పాటు థర్డ్ జెండర్ 13మందితో కలిపి మొత్తం 2,11,937మంది ఓటర్లు పెద్దాపురం నియోజకవర్గంలో గలరని ఈఆర్వో తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు వజ్రపు జితేంద్ర, లక్ష్మీకుమారి, మున్సిపల్ కమీషనర్ జె.సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## పిఠాపురం అసెంబ్లీ ఓటర్ల తుది జాబితా ప్రకటించిన అధికారులు

**– పిఠాపురం నియోజకవర్గ మొత్తం ఓటర్లు 2 లక్షల 30 వేల 46 మంది**




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** కేంద్ర ఎన్నికల సంఘము వారి ఆదేశముల ప్రకారము 37- పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గము నందు గల 3 గ్రామీణ మండలాలు అనగా ( పిఠాపురం, గొల్లప్రోలు, యు. కొత్తపల్లి) మరియు రెండు మున్సిపాలిటీలు ( పిఠాపురం, గొల్లప్రోలు ) పరిధిలో గల 242 పోలింగ్ కేంద్రములలో మరియు ఏ.ఈ.ఆర్.వో వారి పరిధినందు తుది ఓటర్ల జాబితాను ప్రచురించారు. ప్రచురించిన తుది జాబితా ప్రకారము 37- పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గము యొక్క ఓటర్లు మొత్తము 230046, పురుషులు 115223, స్త్రీలు 114819, ఇతరులు 4 ఉన్నారు. గత అక్టోబర్ నెల ది. 2023 అక్టోబర్ 27వ తేదీన ప్రచురించిన జాబితా తదుపరి 8,333 మంది ఓటర్లను నూతనముగా నమోదు చేయగా , చనిపోయిన వారు (1387), శాశ్వతముగా ఊరు వదిలి వెళ్లినవారు (3986), రెండు ఓట్లు కలిగి వున్నవారు (1120), మొత్తముగా 6493 తొలగింపు చేయడమైనదని పేర్కొన్నారు. ప్రచురించిన తుది జాబితా ప్రకారము 37- పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గము యొక్క ఓటర్లు వివరములు ఈ విధముగా ఉన్నాయి.

పురుషులు: 115223, స్త్రీలు 114819, మూడవ జెండర్ 18-19 వయస్సు గలిగిన యువ ఓటర్లు: 3616, (దివ్యాంగులు ) ఓటర్లు : 2664, సర్విస్ ఓటర్లు 142, సెక్స్ వర్కర్స్ 602 ఉన్నారు. సంక్షిప్త సవరణ 2024లో భాగముగా గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో ప్రతి వారము సదరు వారములో జరిగిన ప్రగతిని వివరించి సంబంధిత అన్ని క్లెయిమ్ ల యొక్క వివరములు అందజేయడం జరుగుచున్నదని, ఇప్పటివరకు 27 సార్లు... గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో సమావేశములు నిర్వహించడము జరిగిందన్నారు. ముసాయిదా ప్రచురణ సమయంలో ఒకే డోర్ నంబర్‌లో 10 కంటే ఎక్కువ మంది ఓటర్లు గల ఇళ్లు 136 ఉన్నవని, సదరు డోర్ నంబర్లను సరిదిద్దడమైనదని, మరియు జంక్ క్యారెక్టర్‌లు గల ఇల్లు 68 ఉండగా వాటిని కూడా సరిచేయడమైందన్నారు. ప్రస్తుత రివిజన్‌లో 490 ఫోటో సారూప్య ఎంట్రీలు, 67 డెమో గ్రాఫికల్ సారూప్య ఎంట్రీలు తీసివేయబడ్డాయని, నియోజకవర్గము లోని 242 పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులకు సంబంధించి విద్యుత్, ఫర్నిచర్, టాయిలెట్లు, తాగునీరు , ర్యాంప్ లను సమకూర్చడం జరిగిందని పి. త్రినాద్ రావు, సహాయ ఓటరు నమోదు అధికారి, 37- పిఠాపురం అసెంబ్లీ నియోజక వర్గము మరియు తహశీల్దార్, పిఠాపురం వారు తెలిపారు.

## చేబ్రోలు సీతారామస్వామి దేవస్థానం వద్ద భారీ అన్న సమారాధన



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** భారతీయుల చిరకాలపు స్వప్నం సహకారమయింది బాల రాముడు అయోధ్యలో కొలువుతీరాడు ఉత్తరప్రదేశ్ అయోధ్య నగరంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటల 36 నిమిషాల 32 సెకండ్లకు అయోధ్య శ్రీరామ మందిర నిర్మాణం ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో సాలిగ్రామ శిలలతో రూపొందించిన బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు మెయిన్ రోడ్ ఆనుకుని ఉన్న శ్రీ శ్రీ శ్రీ సీతారామ స్వామి వారి పురాతన ఆలయం వద్ద గొల్లప్రోలు జడ్పిటిసి ఉలవకాయల నాగలావరాజు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. అలాగే పట్టణ గ్రామీణ ప్రాంతాలలో గొల్లప్రోలు తాటిపర్తి దుర్గాడ ఏ విజయనగరం శ్రీ సీతారాం స్వామి వారి ఆలయాలు విద్యుత్ కాంతులతో పచ్చని మామిడాకుల తోరణాలు వివిధ పూలమాలలతో శోభయ మానంగా అలంకరించారు. సోమవారం తెల్లవారుజాము నుండి ఆలయాల వద్ద హరి నామ సంకీర్తనలు భజన బృందాలు కోలాటం వివిధ రకాలుగా రామనామ స్వర్ణతో ఆలయాలు వద్ద భక్తులు కోలాహలం మధ్య స్వామి దర్శనానికి బారులు తీరారు . భగవత్ నామ స్వర్ణ తో పునీతులు అవుతున్నారు అలాగే ఆలయ కమిటీ సభ్యులు విచ్చేసిన భక్తులకు ప్రసాద విస్తరణ పులిహెూర పంపిణీ భోజన వసతులు సమకూరుస్తూ రామసేవలో తరిస్తున్నారు పిఠాపురం గొల్లప్రోలు యు కొత్తపల్లి మండలాలలో ఆధ్యాత్మిక శోభతో ఒక పండగ వాతావరణం కనిపిస్తుంది. కులాలకు మతాలకు అతీతంగా ప్రజలు కలుసుకట్టుగా అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి దివ్యమంగళ విగ్రహం ప్రాణ ప్రతిష్ట పై భరతమాతను వెయ్యి నోళ్ల పొగడ్తలు వర్షం కురిపిస్తున్నారు.

## జిల్లా ఉపాధి కార్యాలయంలో జనవరి 25 వ తేదీన మినీ జాబ్ మేళా

**– జిల్లా ఉపాధి అధికారి హరిశ్చంద్ర ప్రసాద్**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జనవరి 25 వ తేదీ గురువారం ఉదయం 09:30 గంటలకు ఎస్ బి ఐ లైఫ్ , టాటా ట్రెంట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ కొరకు ఫర్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, ఫార్మసీ ట్రైనీ, సేల్స్ ఎక్జిక్యూటివ్, లైఫ్ మిత్రస్, డెవలప్మెంట్ మేనేజర్స్ కొరకు జిల్లా ఉపాధి కార్యాలయం, షెల్టన్ హెూటల్ సమీపంలో, హెచ్ పీ పెట్రోల్ పంప్ వెనుక, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా నందు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె. హరిచంద్ర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ మరియు ఆంధ్ర ప్రదేశ్ అంతటి ప్రాంతాలలో పని చేయాల్సింది ఉంటుందన్నారు. దీనికి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీ/ఎం/డి ఫార్మసీ వరకు చదువుకున్న 18-40 సం.ల వయసు గల నిరుద్యోగ యువతి, యువకులు అర్హులు. వీరికి జీతం రు. 10,000/- నుంచి 18,000/- రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. సహాయం కొరకు 8247437773 నెంబర్ సంప్రదించగలరు.